Andhra jyothy D- 06/05/17



మెట్రోస్టేషన్ పరిసరాల ఊహా చిత్రం

# మెట్రోస్టేషన్లకు మరిన్ని హంగులు

- అత్యున్నత ప్రమాణాలతో రూపకల్పన
- 78 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి
- ఇక మౌలిక వసతుల కల్పనపై దృష్టి
- స్టేషన్లకు ఇరువైపులా స్ట్రీట్ ఫర్నిచర్, బస్ బేలు
- భారీ వర్షాలకు నీట మునగకుండా ప్రత్యేక పైపులైను వ్యవస్థ
- మియాపూర్ - హైదర్‌నగర్ మార్గంలో 'రాహ్‌గిరి' వేదిక
- నేడు కార్యాచరణను ప్రకటించనున్న హెచ్ఎంఆర్

2లో

# మెట్రోస్టేషన్లకు మరిన్ని హంగులు

- నేడు హెచ్ఎంఆర్ కార్యాచరణ ప్రకటన

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శ్రేణి ప్రమాణాలతో మెట్రో స్టేషన్‌లను తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. మెట్రోకు ముందు.. మెట్రోకు తర్వాత అన్న నినాదంతో నగరంలో నిర్మాణంలో ఉన్న కారిడార్‌లను ప్రత్యేక వసతులతో నిర్మించనున్నారు. హడావుడిగా ప్రారంభోత్సవం చేయకుండా మెట్రో స్టేషన్, కారిడార్‌ల పొడవునా అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసే విధంగా హెచ్ఎంఆర్‌కు ప్రభుత్వం సూచనలు చేసింది. ఇందులో భాగంగా ప్రతి మెట్రో స్టేషన్‌లో పార్కింగ్ సౌకర్యాలు, స్ట్రీట్ స్కేపింగ్, బ్యూటిఫికేషన్‌లను చేయనున్నారు. మెట్రోస్టేషన్ మొదటి అంతస్థులో వ్యాపార సంస్థలు, ఏటీఎంలు, టికెట్ కౌంటర్‌లు ఉంటాయి. రెండో అంతస్థులో మెట్రో రైలు ప్లాట్‌ఫామ్ ఉంటుంది. మెట్రో స్టేషన్‌లో ఉండే రెండు అంతస్థులకు వెళ్లేందుకు మెట్ల మార్గంతో పాటు లిఫ్టులు, ఎస్కలేటర్లను ఏర్పాటు చేస్తారు. ఈ రెండు అంతస్థులను ఎల్ అండ్ టీ సంస్థ చేపడుతుండగా రోడ్డు మీద ఉండే పుట్‌పాత్‌లను హెచ్ఎంఆర్ ప్రత్యేకంగా చేపడుతోంది. మెట్రో ప్రాజెక్టు పనులు ఇప్పటికే 78 శాతం పూర్తి కావడంతో ఇక కారిడార్‌లలో అవసరమైన మౌలిక వసతులను అత్యున్నత ప్రమాణాలతో కల్పించనున్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ మెట్రో కారిడార్‌లలో చేపట్టే అభివృద్ధి పనులపై పలుమార్లు హెచ్ఎంఆర్ అధికారులతో చర్చించారు. ఈ పనులకు జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీసు శాఖ, విద్యుత్ శాఖ సహకరించాలని మంత్రి ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించేందుకు సిద్ధంగా ఉందని హెచ్ఎంఆర్ అధికారులు తెలిపారు.



బస్ బే నమూనా

## స్టేషన్‌కు ఇరువైపులా ఆకర్షణీయంగా...

మెట్రో స్టేషన్‌లకు ఇరువైపులా స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కాలిఫ్లోర్లు, స్ట్రీట్ ఫర్నిచర్, బస్‌బేలకు మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి స్టేషన్ లోనూ వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను నిర్మించనున్నారు. అదే విధంగా భారీ వర్షాలు కురిసినప్పుడు మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతాలు నీట మునగకుండా ప్రత్యామ్నాయ పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న పైప్‌లైన్‌లకు అనుసంధానం చేసే పనులు చేపట్టనున్నారు. మెట్రో రైలులో ప్రయాణం తర్వాత బయటకు వచ్చే ప్రయాణికులకు అవసరమైన నడుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు.

## మియాపూర్ - హైదర్‌నగర్ మార్గంలో...

వారాంతపు సందడికి వేదికైన రాహ్‌గిరిని మియాపూర్ - హైదర్‌నగర్ మెట్రో కారిడార్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను ప్రత్యేకంగా రూపొందించామని మెట్రో అధికారులు తెలిపారు. సుమారు 2 కిలో మీటర్లు ఉండే ఈ వేదికలో పిల్లల కోసం ఆట స్థలం, యోగా, వ్యాయామం నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మాదాపూర్ హైటెక్ సిటీలో రాహ్‌గిరికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం రోహెజా చౌరస్తా నుంచి గచ్చిబౌలి - రాయదుర్గం చౌరస్తా వరకు ఉన్న మార్గంలో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రణాళిక(ఎస్ఆర్‌డీపీ) పనులు .నిర్వహిస్తున్నారు. దీంతో రాహ్‌గిరికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. అదే తరహాలో మియాపూర్ - హైదర్‌నగర్ లోనూ ఏర్పాటు చేసేందుకు హెచ్ఎంఆర్ ప్రణాళికలు రూపొందించింది.